క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



బాధ్యతలు స్వీకరించిన అంజనేయరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్

కొనకనమిట్ల: మండల తహసీల్దార్‌గా ఆవుల సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా షేక్.షాజిదా విధులు నిర్వర్తించారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనను ఆర్ఐ, పలువురు వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గిద్దలూరు తహసీల్దార్‌గా అంజనేయరెడ్డి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు తహసీల్దార్‌గా అంజనేయరెడ్డి బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంజనేయరెడ్డి రాష్ట్ర సెక్రటరేట్‌లో విధులు నిర్వహిస్తుండగా ఇటీవల జరిగిన బదిలీల్లో గిద్దలూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య, వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు అంజితో పాటు రెవెన్యూశాఖ అధికారులు ఘన స్వాగతం పలుకుతూ సత్కరించారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

పొదిలి: నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుడు గడ్డం చిన్న మస్తాన్ మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.15 వేల నగదును కుటుంబ సభ్యులకు కమిషనర్ చంద్రశేఖరరెడ్డి అందజేశారు. కార్మికుని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులు స్వాధీనం



గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను అడ్డుకున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: కంటైనర్ లారీలో అక్రమంగా తరలిస్తున్న 89 గోవులను బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారు జామున పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్ వద్ద అడ్డుకున్నారు. అనంతరం ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వైపీ సోమయ్య సంఘటన స్థలం వద్దకు చేరుకుని అక్రమంగా తరలిస్తున్న గోవులను మార్కెట్ యార్డుకు తరలించారు. హనుమాన్ జంక్షన్ నుంచి హిందూపూర్ కోతకు వెళ్తున్న గోవులను రక్షించి సురక్షితంగా బయటకు తీశారు. గోసంరక్షణ చట్టం అమలులో ఉందని పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి రామాలయ ప్రతిష్ఠ ఉత్సవాలు



ముస్తాబైన రామాలయం

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట పంచాయతీ పేరారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు సీతాలక్ష్మణ హనుమత్ సహిత పట్టాభిరామచంద్రస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం గంగానయనము, గోపూజ, గణపతి పూజా కార్యక్రమాలతో ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమవుతాయని శని, ఆదివారాలలో గ్రామోత్సవాలు, పోలేరమ్మ, పోతురాజుస్వామి, బొడ్డురాయి ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, నూతన విగ్రహ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం నిర్వహిస్తామని వివరించారు.

జీఓ 117ను రద్దు చేయాలి

మార్కాపురం టౌన్: తాము అధికారంలోకి రాగానే జీఓ 117ను రద్దు చేస్తామని చెప్పిన టీడీపీ, జనసేన నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నా కూడా జీవోను రద్దు చేయకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలనుకోవడం భావ్యం కాదని, తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను మూసివేయాలనే ఆలోచన తగదని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఖరీఫ్ కన్నీరే..!

- తర్లుపాడు మండలంలో సాగు లక్ష్యం 3,824 హెక్టార్లు
- ఇప్పటి వరకు సాగైంది 85 హెక్టార్లు
- వర్షాభావ పరిస్థితులతో రైతుల్లో ఆందోళన



పంటలు వేసేందుకు సిద్ధంగా ఉన్న పొలం

వర్షాలు పడితే పంటలు వేస్తాం



మంచి వర్షం పడితే మిర్చి, పత్తి సాగు చేసేందుకు పొలం సిద్ధం చేసుకున్నా. గతేడాది ఇదే సమయానికి వర్షాలు పడటంతో పంటలు సాగు చేశాం. ఈ ఏడాది రెండు నెలలైనా వర్షాలు లేకపోవడంతో పొలాలన్నీ బీడుగా ఉన్నాయి. వర్షాలు కురవాలని రోజూ దేవుడికి మొక్కుకుంటున్నాం.

– మహేష్‌రెడ్డి, రైతు, రాగసముద్రం

తర్లుపాడు:

ఈ ఏడాది ఖరీఫ్ సాగు రైతులను ఆందోళనలోకి నెట్టింది. సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. ఇటీవల అడపా దడపా కురిసిన వర్షాలు పంటల సాగుకు పెద్దగా ఉపయోగం లేకపోవడంతో లోలోన మదనపడుతున్నార తర్లుపాడు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 3,824 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 80కి పైగా హెక్టార్లలో మాత్రమే పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వరి 212 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా ఒక్క హెక్టారులో కూడా వరి నాట్లు వేయలేదు. జొన్న, మొక్కజొన్న, రాగి, కొర్ర తదితర పంటలు కూడా అసలు సాగు చేయలేదు. సజ్జ మాత్రం 34 హెక్టార్లకుగాను 5 హెక్టార్లలో, కంది 1369 హెక్టార్లకుగాను 12 హెక్టార్లలో, పత్తి 561 హెక్టార్లకు గానూ 24 హెక్టార్లలో, మిర్చి 1086 హెక్టార్లకుగాను 2 హెక్టార్లలో, టమోటా 12 హెక్టార్లకుగానూ 2 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. మండలంలోని తాడివారిపల్లి, సీతానాగులవరం, చెన్నారెడ్డిపల్లి, తుమ్మలచెరువు, కలుజువ్వలపాడు, పోతలపాడు, గానుగపెంట, మంగళకుంట, జగన్నాథపురం, కేతగుడిపి తదితర గ్రామాల్లో కొంతమంది రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు సజ్జ, కంది, ఆముదం పంటలను సాగుచేశారు. మంచి వాన పడితే పత్తి, మిరప వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. పలువురు రైతులు నర్సరీలకు వెళ్లి మిరప నారు కొనేందుకు అడ్వాన్స్ కూడా ఇచ్చారు. సీతానాగులవరం తదితర గ్రామాల్లో రైతులు పొగాకు సాగు చేసేందుకు కూడా ఆసక్తి చూపుతున్నారు. ఈ గ్రామంలో పొగాకు బ్యార్నీలు ఉన్నాయి. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతుల ఆశలు తలకిందులయ్యాయి.

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా



మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ సుశీలాదేవి



పొదిలిలో సీమంతాలు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ సుభాషిణి

మార్కాపురం: నవజాత శిశువులకు తల్లిపాలే మొదటి టీకాలా పని చేసి బిడ్డ ఎదుగుదలకు ఎంతో ఉపకరిస్తాయని మార్కాపురం ఐసీడీఎస్ సీడీపీఓ సుశీలాదేవి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కొండేపల్లి రోడ్, సిఫానీ బజారులోని అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం.బుజ్జి, కె రవికుమార్, కె.రమాదేవి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సామూహిక సీమంతాలు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని నందిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సుభాషిణి ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ముందుగా తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అవినాష్, మహిళా సంరక్షణ కార్యదర్శి విజయరాణి, పంచాయతీ కార్యదర్శి శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి: తల్లిపాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని ప్రభుత్వ వైద్యుడు శరత్ చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగర పంచాయతీ ఒకటవ సచివాలయం పరిధిలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.మేరీనా, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ, ఏఎన్‌ఎం కె.విజయ, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ, సచివాలయం ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తర్లుపాడు: తల్లిపాలు బిడ్డకు అమృతమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం తాడివారిపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ షేక్ ఖలీసా, ఏఎన్‌ఎం గాలెమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు 'అంగన్‌వాడీ' కేంద్రాలు మార్గదర్శకంగా పని చేస్తాయని సూపర్‌వైజర్ సరిత పేర్కొన్నారు. బుధవారం గొట్లగట్టు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య, పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతను బాలింతలకు వివరించాలని చెప్పారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నేడు ఎస్‌ఎంసీ ఎన్నికలు



ఎస్‌ఎంసీ ఎన్నికలపై సూచనలిస్తున్న ఎంఈఓ (ఫైల్)

- కంభం మండలంలో 20 సమస్యాత్మక ప్రాంతాలు

కంభం: నియోజకవర్గంలోని 325 పాఠశాలల్లో గురువారం ఎస్‌ఎంసీ ఎన్నికలకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయ 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష పద్ధతిలో చేతులు ఎత్తడం ద్వారా ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికైన సభ్యులు ఎస్‌ఎంసీ చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రమాణ స్వీకారం నిర్వహించి సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల మధ్యలో కొత్త కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. కంభం మండలంలో జంగంగుంట్ల, ఎల్‌కోట, కందులాపురం, రావిపాడు, కంభం, చిన్నకంభం, లింగాపురం, పెద్దనల్లకాల్వ, యర్రబాలెం, తురిమెళ్ల, నర్సిరెడ్డి పల్లి గ్రామాల్లో 20 పాఠశాలలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి విద్యాశాఖాధికారులు పోలీసు భద్రత కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికలు ఏవైనా తమ పార్టీకి చెందిన వారే ఉండాలన్న ఉద్దేశంతో అధికార పార్టీ నాయకులు కొన్ని చోట్ల ఏకగ్రీవాలు చేసేందుకు, మరికొన్ని చోట్ల తమ పార్టీ సానుభూతిపరులను గెలిపించుకునేలా గత నాలుగైదు రోజుల నుంచి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కొన్ని చోట్ల పాఠశాల అభివృద్ధికి డబ్బులు ఇస్తామని చెప్పి అవతల పోటీ లేకుండా చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన ఎన్నికల్లో రాజకీయ జోక్యం లేకుండా ఎన్నికలు పకడ్బందీగా జరిగేలా చూడాలని ప్రజలు, పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఆర్ఐఓ సైమన్ విక్టర్

కంభం: ప్రభుత్వం అందించే పథకాలు, సౌకర్యాలు సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులో రాణించాలని ఇంటర్మీడియెట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాల పంపిణీ చేశారు. పాఠ్య పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను, బ్యాగ్‌లను ఉచితంగా ఇవ్వడం ఇంటర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఎంఈఓ మాల్యాద్రి పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరపాలి

దొనకొండ: పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు గురువారం ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మండల విద్యాధికారి ఎన్.సాంబశివరావు సూచించారు. మండలంలోని 70 పాఠశాలల్లో 4,250 మంది విద్యార్థులు ఉన్నారని, ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగించుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే తమకు తెలియజేయాలని ఎంఈఓ సూచించారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో రాజకీయాలొద్దు



హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై

కొనకనమిట్ల: ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి గురువారం నిర్వహిస్తున్న మేనేజింగ్ కమిటీ ఎన్నికలను రాజకీయాలకు అతీతంగా ప్రశాంతంగా నిర్వహించేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎస్ఐ మాధవరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓలు ఎస్‌కె డాంగేషరీఫ్, బరిగె నరసింహారావుతో కలిసి నిర్వహించిన హెచ్‌ఎంల మావేశంలో ఎస్సై మాట్లాడారు. కమిటీ ఎన్నికకు ముందుగా తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఏకాభిప్రాయంతో ఎన్నిక కుదరని పక్షంలో రహస్య ఓటింగ్ నిర్వహించాలని చెప్పారు. ఏదైన సమస్య వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కమిటీ ఎన్నికకు రాజకీయ నాయకులను అనుమతించవద్దని స్పష్టం చేశారు. ఎంఈఓ–1 ఎస్‌కె డాంగేషరీఫ్ మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేశామన్నారు. హెచ్‌ఎంల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు.

షేడ్‌నెట్ నర్సరీలను తనిఖీ చేసిన కలెక్టర్



వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొమరోలు: మండలంలోని తాటిచెర్లమోటులో ఉన్న షేడ్‌నెట్ నర్సరీలను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ సాగు చేస్తున్న నారు పెంపకం, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ గురించి వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నాణ్యమైన నారు అందించాలని నర్సరీ యజమానులకు సూచించారు.

వాతావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటాలి

దర్శి: వాతావరణ వ్యవస్థను పరిరక్షించాలంటే మొక్కలు నాటి పెంచాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ సూచించారు. స్థానిక బాలికల పాఠశాలలో బుధవారం మొక్కలు నాటి వాటి ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. పాఠశాలలకు మొక్కలు అందజేసిన న్యాయవాది సురేష్‌ను అభినందించారు.

రుణాల మంజూరుకు అర్హులను గుర్తించాలి



పొదుపు మహిళలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధర

బేస్తవారిపేట: ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకంలో లోన్లకు అర్హులను గుర్తించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసుంధర అన్నారు. బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలానికి రెండు లక్షలు, రూ.2–5 లక్షల రుణాలు 50, ఒకటి నుంచి రెండు లక్షల లోపు రుణాలు 200 మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రతి గ్రూప్‌లో సభ్యులకు సంబంధించి లోకోస్ సర్వేను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు అర్హులకు ఇవ్వాలని, స్త్రీనిధి రికవరి వంద శాతం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పొదుపు మహిళలతో మాట్లాడారు. ఏరియా కో ఆర్డినేటర్ అంబేద్కర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు గొంగటి అంజనాదేవి, ఏపీఎం కంచర్ల రఘునాథబాబు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ ప్రతిష్ఠ ఉత్సవాలు



కలశ పూజల్లో పాల్గొన్న ఉభయదాతలు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుడు కారంచేటి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజల్లో ఉభయదాతలు కంకణాలు ధరించి హోమాలు, అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

పంట నమోదు చేసుకోవాలి



వరినారును పరిశీలిస్తున్న ఏఓ షేక్ మహ్మద్

అర్ధవీడు (బేస్తవారిపేట): పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి షేక్ మహ్మద్ అన్నారు. బుధవారం మండలంలోని బోగోలులో పంటలను పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పంటలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసిన రైతులంతా నమోదు చేసుకోవడంతో పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్, ధాన్యం కొనుగోలుకు ఈ–క్రాప్ బుకింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వరి నారును పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. వీఏఏలు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ పనులపై ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ అర్జునరావు

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెల వరకు జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులకు రూ.11 కోట్లు, పంచాయతీ రాజ్ పనులకు రూ.6 కోట్ల పనులకు సంబంధించి పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. దీనిపై ప్రజావేదికను డ్వామా పీడీ అర్జునరావు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్‌లను తొలగించేందుకు గ్రామాల్లోని టీడీపీ నాయకులు ఉపాధి హామీ పనులకు వచ్చిన వారిని రాలేదని, పాఠశాలల్లో స్వీపర్‌గా పనిచేస్తూ వేసవి సెలవుల్లో ఉపాధి పనులు పనిచేసిన తప్పు అన్నట్లుగా ప్రజావేదికలో ఆరోపణలు చేశారు. దీనిపై ఎంపీపీ, జెడ్పీటీసీలు గట్టిగా స్పందించడంతో రికవరీ లేకుండా వీఆర్వో విచారణకు ఆదేశాలిచ్చారు. జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ, డ్వామా ఏపీడీ భాస్కరరావు, ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎస్ఆర్‌పీ నందిని, ఎంపీడీఓ టి.పార్వతి, ఏపీఓ కుమార్ పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి 'మండల్' కృషి ఎనలేనిది



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీఎల్‌పీ యాదవ్, బీసీ నాయకులు

మార్కాపురం: దేశవ్యాప్తంగా బీసీల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బిందేశ్వరీ ప్రసాద్ మండల్ యాదవ్(బీపీ మండల్) అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం బీపీ మండల్ డే సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పీఎల్‌పీ యాదవ్ మాట్లాడుతూ.. బీపీ మండల్ నివేదికతో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ దక్కిందని, అందుకు గుర్తుగా ఏటా ఆగస్టు 7ను బీపీ మండల్ డేగా నిర్వహించుకుంటున్నామన్నారు. కమిషనర్ సిఫార్సులు 40 ఉండగా ఒకటి మాత్రమే అమలు చేస్తున్నారని, మిగిలిన 39 సిఫార్సులు కూడా అమలు చేయాలని కోరారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీసీ వసతి గృహాలను శాశ్వత భవనాల్లో ఏర్పాటు చేయాలన్నారు. మార్కాపురంలో బీసీ బాలికలకు వసతి గృహం లేని కారణంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఐ.రంగస్వామి గౌడ్, జీవీ సుబ్బారావు, నాగం రామకృష్ణ, వెంకటేష్, రవిప్రకాష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కౌలుకార్డులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జుననాయుడు

కొమరోలు: మండలంలోని అర్హులైన కౌలు రైతులకు తప్పనిసరిగా కౌలు కార్డులు అందించాలని తహసీల్దార్ మల్లికార్జుననాయుడు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఏఈఓలు, రెవెన్యూ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మల్లికార్జున నాయుడు మాట్లాడుతూ సీసీఆర్‌సీ చట్టం ప్రకారం మండలంలోని ప్రతి ఒక్క కౌలు రైతుకు తప్పనిసరిగా కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. మండలంలో 950 సీసీఆర్‌సీ కార్డులివ్వాలని కలెక్టర్ ఆదేశించగా ఇప్పటి వరకు 555 కార్డులు మాత్రమే ఇచ్చినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ పాల్గొన్నారు.